క్లుప్తంగా

విద్యాభివృద్ధికి చేయూత అభినందనీయం



విద్యార్థులకు అందజేసిన నోట్ బుక్స్

బల్లికురవ: గ్రామంపై ఉన్న మమకారంతో ఉపాధ్యాయుడు విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని వల్లాపల్లి యూపీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాఠశాలలోని 165 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు పెన్నులు, పలకలు, ఉపాధ్యాయులకు కుర్చీలను గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బాదం రామకృష్ణారెడ్డి అందజేశారు. దాత ఇచ్చిన చేయూతను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని హెచ్ఎం ఉపాధ్యాయులు కోరారు. అనంతరం దాతలను ఉపాధ్యాయులు చింతల రామకృష్ణ, పీ రామాంజనేయులు, సావిత్రి కనకదుర్గ కొనియాడారు.

లబ్ధిదారులకు రుణాల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

పర్చూరు(చినగంజాం): లక్‌పతి దీదీ పథకంలో భాగంగా మండలంలోని 25 మంది లబ్ధిదారులకు గేదెల కొనుగోలు కోసం రూ. 25 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు వీరన్నపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజశేఖర్ తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ శాఖ పరిధిలోని గ్రామ సంఘ సహాయకురాళ్లతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలో 302 సంఘాలలో 3029 సభ్యులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం వీఓఏలను సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీసీలు ఎం శ్రీనివాసమూర్తి, నరసింహారావు, గ్రామ సమాఖ్య సహాయకులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్




స్వర్ణలో పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

స్వర్ణ(కారంచేడు): పదో తరగతి విద్యార్థులు ఏడాదంతా ఇష్టపడి చదివిన చదువుకు మంచి ప్రతిఫలం కావాలనుకుంటే జరగబోయే పరీక్షల్లో కష్టపడి రాయాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో సమకూర్చిన పరీక్ష సామగ్రిని ఆయన పంపిణీ చేశారు. కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థి కుమ్మరి అలెగ్జాండర్, కుమ్మరి అశోక్ కుమార్‌లు జ్ఞాపకార్థం పరీక్ష సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, ఎస్ఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

వెంకన్నస్వామి నామాలకు భూమి పూజ

బల్లికురవ: బల్లికురవలో గ్రామస్తులు భక్తుల కృషితో వెంకటేశ్వర స్వామి శంఖు, నామాలు, చక్రం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. బల్లికురవ నుంచి అద్దంకి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి పడమర భాగంలో నిర్మాణ పనులకు సంబంధించి అర్చకులు అయిన వోలు వెంకట సుబ్బాచార్యులచే వేద మంత్రోచ్ఛరణల మధ్య పంచామృత అభిషేకం చేశారు. సుమారు రూ.7 లక్షల అంచనాలతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నెల రోజుల్లో నిర్మాణం పూర్తి అవుతుందని గ్రామ కమిటీ తెలిపారు. వివాహాలు చేసుకునే వధూవరులు ఇప్పటి వరకు వెంకటన్న స్వామి నామాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం



చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి వేదిక అని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. డీటీ అర్జున్, వీఆర్వోలు, ఉద్యోగులు ఉన్నారు.

రక్తనిధి బండి.. ప్రాణం లేదండి !

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదంటారు.. అలాగే అన్ని దానాల్లో కెల్లా ప్రాణదానం కూడా గొప్పది. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందంటే అతిశయోక్తికాదు. కాని కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రుల్లో రక్త నిల్వలు తగ్గతుండటంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రక్తాన్ని సేకరించే వాహనం మూడు నెలలుగా మూలన పడిందంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం అవుతోంది. వాహనం మరమ్మతులకు గురవడం.. రక్తాన్ని సేకరించకపోవడంతో రక్తనిల్వలు తగ్గిపోతున్నాయి..

- రక్త నిధి కేంద్రానికి ప్రమాద ఘంటికలు
- మూడు నెలలుగా మూలనపడిన రక్తసేకరణ వాహనం
- వేసవిలో దాతల నుంచి రక్తసేకరణ కష్టమంటున్న వైద్యులు
- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం



మూడు నెలులగా మూలనపడిన రక్తసేకరణ సంచార వాహనం

చీరాల రూరల్:

చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలోని రక్తనిధి కేంద్రానికి ప్రమాద ఘంటికలు మోగనున్నాయి. మూడు నెలలుగా రక్తనిధి కేంద్రానికి సంబంధించిన సంచార వాహనానికి నిధులు లేక మూలన పెట్టారు. అసలే రానున్నది ఎండాకాలం. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు అయిపోగానే విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోతారు. ఈ సమయంలోనే రక్త నిధి కేంద్ర సిబ్బంది సంచార వాహనం ద్వారా కాలేజీలకు వివిధ గ్రామాలకు చేరుకుని అధిక మొత్తంలో దాతల నుంచి రక్తాన్ని సేకరించి రక్త నిధి కేంద్రంలో రోగుల భవిష్యత్ ఆపరేషన్ల అవసరాల కోసం వినియోగిస్తారు. ఎంతో విలువైన రక్తనిధి కేంద్ర సంచార వాహనం మూడు నెలలుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రస్తుతం ఆ వాహనాన్ని గ్రామాలకు తిప్పకుండా మూలనపెట్టారు. చీరాలతో పాటు బాపట్లకు ఇది ఒక్కటే వాహనం కావడం విశేషం.

విరాలలోకి వెళితే..

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక 100 పడకల చీరాల ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల ఎంతో పేరుగాంచింది. చీరాల, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల పేద ప్రజలకు సంజీవని వంటిది ఆయా ప్రాంతాలకు చెందిన పేద వర్గాల ప్రజలు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఈ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని వైద్య సేవలు పొందుతుంటారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాగా అవతరించిన తరుణంలో చీరాల ప్రభుత్వ వైద్యశాల జిల్లాలోనే పెద్దాసుపత్రిగా పేరుగాంచింది. ఈ వైద్యశాలలో రోగులకు అవసరమైన అన్ని విభాగాలు ఉన్నాయి. తల్లీబిడ్డల కాన్పుల వార్డుతో పాటు రోడ్డు ప్రమాదాల బారినపడిన బాధితులకు ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు, కిడ్నీ బాధితులకు డయాలసిస్ యూనిట్, సీటీ స్కాన్ కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ ఆసుపత్రిలో రోగులకు ఆపరేషన్లు జరిగే సమయంలో రక్తం విధిగా అవసరమవుతుంది. ఆ సమయంలో రక్తనిధి కేంద్రంలో రక్తం నిల్వలు లేకపోతే రోగులకు చాలా ప్రమాదం పొంచి ఉంటుంది.

ఆరు నెలలుగా నిధులు మంజూరు చేయని ప్రభుత్వం..

ఆరు నెలలుగా రక్తనిధి కేంద్ర వాహనానికి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మూడునెలలుగా వాహనం మరమ్మతులకు గురై మూలనపడింది. వాహనంలోని ఏసీ పని చేయడం లేదు. వాహన ముందు టైరు కూడా పాడైపోయింది. మరికొన్ని మైనర్ రిపేర్లు కూడా ఉన్నాయి. దాతల ద్వారా సేకరించిన రక్తాన్ని వాహనంలోని ఏసీలో భద్రపరిచి ఆసుపత్రికి తీసుకొస్తారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని శుద్ధి చేయడానికి (ఎలిసా) టెస్టుల కోసం గతంలో ఒంగోలు తరలించేవారు. ఒంగోలులో రక్తాన్ని శుద్ధిచేసిన తరువాత చీరాలకు తీసుకొచ్చేవారు. కానీ ఎలిసా టెస్టులు చీరాలలోనే చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరిచేందుకు రక్తనిధి కేంద్రంలోని డీప్ ఫ్రీజర్‌లో 200 రక్త బ్యాగులు నిల్వచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అలానే దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ఎలిసా టెస్టులు చేసే వరకు భద్రపరిచే డీప్ ఫ్రీజర్‌లో 150 బ్యాగులు దాచే సామర్థ్యం కలిగి ఉంది.



దాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరిచే రక్తనిధి కేంద్రంలోని డీప్ ఫ్రీజర్

అధిక దూరం ప్రయాణం చేయవచ్చు..



దాతల నుంచి సేకరించిన రక్తాన్ని పరీక్షలు (ఎలిసా) శుద్ధిచేసే యంత్ర పరికరాలు

రక్తనిధి కేంద్రంలో వైద్యునితో పాటు వాహన డ్రైవర్, వాహనంలో ఇద్దరు టెక్నీషియన్లు, రక్తనిధి కేంద్రంలో ఇద్దరు టెక్నీషియన్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక ఏఎన్ఎం నిరంతరం పనిచేస్తుంటారు. సంచార రక్తసేకరణ వాహనం సక్రమంగా ఉంటే అధిక దూరం ప్రయాణించి దాతల నుంచి రక్తాన్ని సేకరించవచ్చు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు పూర్తయితే అందరు ఇళ్లకు వెళ్లిపోతారు ఒక్క విద్యార్థి కూడా దొరకని పరిస్థితి ఉంది. ప్రస్తుతం అయితే విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో రక్తాన్ని సేకరించే అవకాశం ఉంది. అలానే తిరునాళ్లు, జాతర్ల వంటివి విపరీతంగా జరుగుతున్నాయి. ఈ సందర్భాల్లో కూడా గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తల నుంచి స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేయిస్తుంటారు. ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతి కూడా ఉంది. అనేక గ్రామాలకు చెందిన యువకులు తమ రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు వస్తుంటారు. ప్రస్తుతం దాతల నుంచి రకాన్ని సేకరించేందుకు చిన్న అంబులెన్స్‌ను రక్తనిధి కేంద్ర సిబ్బంది వినియోగిస్తున్నారు. డీజిల్ ఇతర మెయింటెనెన్స్‌కు వైద్యులు తమ సొంత డబ్బులను వాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రక్తసేకరణ వాహనానికి మరమ్మతులు చేపట్టి రక్తదాతలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి కాలంలో ఇబ్బందే..



సంచార రక్త సేకరణ వాహనం లేకుంటే వేసవి కాలంలో దాతల నుంచి రక్త సేకరణ చేడయం కష్టంగా ఉంటుంది. పెద్ద వాహనం అయితే అనేక గ్రామాలకు సులభంగా చేరుకుని దాతల నుంచి అధిక మొత్తంలో రక్త సేకరణ చేయడం సులభంగా ఉంటుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వాహనానికి మరమ్మతులు చేయించి దాతలకు అందుబాటులో ఉంచుతాము.

– డాక్టర్ రాజా సెల్విన్, ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్.


గిట్టుబాటు ధర ఇచ్చి వరి కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న రమణారెడ్డి

చీరాల టౌన్: దళారులు తక్కువ ధరకు పంటలు కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతలు కన్నీరు పెట్టుకుంటున్నా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి విమర్శించారు. సోమవారం చీరాల మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో వరి ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం కంటితుడుపుగా ధాన్యం బస్తా రూ.1750 ప్రకటించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు, ప్రైవేటు వ్యాపారులు ధాన్యం బస్తాను కేవలం రూ.1400 కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతల కష్టం బస్తాకు రూ.350 దళారులే తింటూ రైతులను అప్పుల పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చీరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతుల కష్టాన్ని కాజేస్తున్నారని, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం రైతులకు శాపంగా మారిందన్నారు.

వెంకన్న సన్నిధిలో కుంకుమ పూజలు



స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన అలివేలుమంగా, పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామివారి సన్నిధిలో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ 49వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని రెండో రోజు స్వామివార్లకు మహిళలు, యువతులు కుంకుమ పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు, క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహించారు.

నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్ సీపీ

- రేపు జరిగే యువత పోరు కార్యక్రమం
- వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



యువత పోరు వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న మధుసూదనరెడ్డి, నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్ సీపీ అండగా ఉంటోందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. ఇంకొల్లు మండలంలోని పావులూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన 'యువత పోరు' వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు, విద్యార్థుల ఫీజు కోసం ప్రభుత్వంపై నిరసన గళం తెలుపడానికి ఈనెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల ద్వారా ఇవ్వాల్సిన బకాయిలు, నిరుద్యోగ యువతకు రూ.3 వేలు భృతి చెల్లించాలన్నారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరసన గళం తెలపడానికి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్‌లు చిన్ని పూర్ణారావు, మున్నం నాగేశ్వర రెడ్డి, కఠారి అప్పారావు, జంపని వీరయ్య, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పల్లెపోగు ప్రసాద్ బాబు, యువ నాయకులు బిల్లా డేవిడ్, విద్యార్థి విభాగం నాయకులు కాటి లక్ష్మణ్, దళిత నాయకులు గేరా స్వరాజ్ కుమార్, బండారు ప్రభాకరరావు, గుంటూరు శ్రీను, కొల్లా సుబ్బారావు చౌదరి, మువ్వా రాంబాబు, మార్నెళ్ల రామకృష్ణ, షేక్ షంషుద్దీన్, మాచవరపు రవికుమార్, తానికొండ ఎలియాజర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ నగదు పెంచాలి

చీరాల అర్బన్: ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ వీవిరమణ చేసిన ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ నగదును పెంపుదల చేయాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజియన్ సెక్రటరీ సీహెచ్ చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు పింఛన్ రూ.1000 నుంచి రూ.3 వేల వరకు మాత్రమే వస్తుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వృద్ధులకు ఇస్తున్నట్లుగా రూ.4 వేల సామాజిక పింఛన్, తెల్ల రేషన్ కార్డు అందించాలని కోరారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



అంబేడ్కర్ భవన్‌లో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాలు



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

అద్దంకి: దేశంలోనే మొట్టమొదటి మహిళాఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శమని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ అన్నారు. సావిత్రిబాయి పూలే 128 వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీ ఎస్సీ, ఎస్టీ బీసీ అండ్ మైనారిటీస్ ఐక్య వేదిక సభ్యులు సోమవారం సింగరకొండ రోడ్‌లోని చైతన్య బధిరుల పాఠశాలలో నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలను బడిలోకి అనుమతించని రోజుల్లో సావిత్రిబాయి తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలే వద్దనే చదువుకుందన్నారు. ఇతర బాలికలకు చదువు చెప్పే ఉపాధ్యాయురాలుగా ఎదిగారని చెప్పారు. ఎన్నో కష్టాలు అయినా ఎదుర్కొని దాదాపు 32 పాఠశాలల స్థాపించి మహిళల విద్యకు పాటుపడి, అనేక సంస్కరణలకు బాటలు వేసిన పూలే నేటి తరానికి ఆదర్శప్రాయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కా కాంతారావు, ఐక్యవేదిక ట్రెజరర్ చెరుపల్లి నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రిద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, కోటేశ్వరరావు, పాల్గొని ప్రసంగించారు.

అద్దంకి రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూనూరి నరేంద్ర, రోశయ్య, హేబేలు, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డి మృతదేహానికి గాదె నివాళులు



అంజిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గాదె

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని తాటిపర్తి వారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని ఆరె అంజిరెడ్డి మరణించడంతో సోమవారం ఆయన మృత దేహానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి నివాళులర్పించారు. ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు, పావులూరు, గంగవరం పీఏసీఎస్ చైర్మన్‌లు పులఖండం రామకృష్ణారెడ్డి, గాదె సుబ్బారెడ్డి, కరుణాకర్,రాందాస్ రెడ్డి, బిల్లాలి డేవిడ్ పాల్గొన్నారు.

రేపు సునీత మాతాజీ ద్రోణాదుల రాక

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ప్రముఖ ధ్యాన సేవకురాలు సునీత మాతాజీ బుధవారం ఉదయం 10 గంటలకు ద్రోణాదుల రానున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక షిరిడి నాగసాయి బాబా మహా క్షేత్ర మందిరం 35వ వార్షికోత్సవం సందర్భంగా పూణేకి చెందిన మహావతార్ బాబా ధ్యాన, హీలింగ్ సెంటర్‌కు చెందిన సునీత మాతాజీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సాయి మందిరం కార్యదర్శి చిన్నం చంద్రశేఖర్ తెలిపారు.

పీ-4 సర్వే సక్రమంగా ఉండాలి

పర్చూరు(చినగంజాం): పీ-4 సర్వే సమాచార సేకరణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని పర్చూరు ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో భాగంగా సోమవారం మండలంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 20 సచివాలయాల పరిధిలో 15727 కుటుంబాలు సర్వే చేయాల్సి ఉందని, ఇప్పటి వరకు 8061 కుటుంబాలు సర్వే నిర్వహించి 51.26 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. సోమవారం పర్చూరు మండలంలోని నూతలపాడు 1,2, తిమ్మరాజుపాలెం, అన్నంబొట్లవారిపాలెం, ఏదుబాడు, ఇనగల్లు, అడుసుమల్లి సచివాలయాల్లో సర్వే పరిశీలించినట్లు ఆయన తెలిపారు.